సాక్షి మెదక్

గురువారం । 7 । మార్చి । 2024



ఏడుపాయలకు రారండి

ఏడుపాయల జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. వివరాలు 8లో ▸



డబ్బుల విషయంలో గొడవ

తాగిన మైకంలో డబ్బుల కోసం గొడవపడి వ్యక్తిని హత్య చేసిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు 8లో ▸



భూములపై రియల్ పడగ

శివ్వంపేట మండలంలో రియల్ ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతోంది. రైతుల భూములపై కన్నేసి కాజేసేందుకు పథకాలు పన్నుతోంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బాలికా విద్యను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ ఫౌజియా

నర్సాపూర్: సంపద సృష్టికి మహిళలే మూలమని, బాలికల విద్యను ప్రోత్సహించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఇందిరా జ్యోతి పేర్కొన్నారు. టీఎస్జీటీఎస్ భవన్‌లో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, పాఠశాలలో లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. బాల బాలికలు సమానమనే విషయం ప్రతి ఇంటి నుంచి మొదలు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శులు జ్యోతి, విశాలాక్షి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, పద్మారావు, రెడ్డిపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఫౌజియా తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి బ్రహ్మాజీ అన్నారు. బుధవారం మండలంలోని దనూర ఉన్నత పాఠశాలలో 'బేటి బచావో- బేటి పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ కొరపాటి సునీత అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఆపద సమయంలో ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీడీపీఓ హేమభార్గవి, మహిళా సాధికారిత కేంద్రం టీం డిస్ట్రిక్ కోఆర్డినేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్ట్ నాగమణి, కవిత, హెచ్‌ఎం వసంత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ పరీక్షలకు బుధవారం 95 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. జనరల్, ఒకేషనల్ పరీక్షలకు గాను 5,741 మంది హాజరుకావాల్సి ఉండగా 5,452 మంది విద్యార్థులు హాజరయ్యారు. 289 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. జిల్లాలోని పాపన్నపేట, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్ కేంద్రాలను డీఈసీ సత్యనారాయణ సందర్శించారు. అలాగే రామాయంపేట, వెల్దుర్తి, తూప్రాన్, మెదక్‌లోని 4 సెంటర్లను జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పరిశీలించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం మెదక్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జీపీ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించాలని మంత్రి సీతక్కకు విన్నవించినా స్పందన కరువైందని వాపోయారు. ఏడుపాయల జాతర పనులకు రాకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం సరికాదన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే శుక్రవారం నుంచి నిరసన తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

10న ప్రవేశ పరీక్ష

నర్సాపూర్: ఈనెల 10వ తేదీన గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కాలేజీ రెండో లెవల్ పరీక్ష నిర్వహిస్తున్నామని గిరిజన సంక్షేమ గురుకులాల మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. ప్రవేశ పరీక్ష కామారెడ్డి జిల్లా సరాంపల్లి చౌరస్తాలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తామన్నారు. మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మాట తప్పితే ఊరుకోం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ
- ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మ

మెదక్ మున్సిపాలిటీ: ఎన్నికల్లో గెలవడం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ ఆరోపించారు. బుధవారం ఎల్‌ఆర్‌ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేస్తామని చెప్పిన మాటలు ఉత్తమాటలుగా మిగిలాయన్నారు. రుణమాఫీ ఇప్పటివరకు చేయలేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు, మెదక్, నిజాంపేట ఎంపీపీలు జయరాంరెడ్డి, సిద్దిరాములు, మండల పార్టీ అధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చార్జీల పేరిట వసూలు: సునీతారెడ్డి

నర్సాపూర్: ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించేందుకు చార్జీల వసూల పేరిట రూ. వేల కోట్లు ప్రజల నుంచి గుంజాలని ప్రభుత్వం యోచిస్తుందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, పార్టీ నాయకులు చంద్రాగౌడ్, శేఖర్, జితేందర్‌రెడ్డి, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి నాయకులు

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం

- 'ధరణి' సమస్యలపై ప్రత్యేక దృష్టి
- యువత ఉపాధి కల్పనకు చర్యలు
- 'సాక్షి'తో కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్: డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం 'సాక్షి'తో పలు విషయాలను పంచుకున్నారు. ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యువత ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

జిల్లాలో గంజాయి, డ్రగ్స్, క్లోరోఫాం, డైజోఫాం లాంటి మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నాయి. వాటిని ఏ విధంగా అరికడతారు?

కలెక్టర్: డ్రగ్స్, గంజాయితో పాటు నిషేధిత మత్తు పదార్థాలపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది. వాటిని ఎవరూ విక్రయించినా ఉపేక్షించేది లేదు. రైతులు గంజాయి సాగు చేస్తే రైతు బంధు నిలిపివేస్తాం. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులను చేస్తాం. పోలీస్ అధికారులతో చర్చించి కఠినంగా వ్యవహరిస్తాం.

జిల్లాలో ఐదు వేల పైచిలుకు ధరణి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్: ధరణిలో ముఖ్యంగా సాదాబైనామాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఒక రైతు మరోవ్యక్తి వద్ద పొలం కొనుగోలు చేసి సాదా బైనామాలు (తెల్లకాగితం)పై రాసుకుంటారు. కొనుగోలు చేసిన వ్యక్తి పొజిషన్‌లో ఉంటాడు. తెల్లకాగితం తీసుకొని తనకు రిజిస్ట్రేషన్ చేయాలని వస్తుంటారు. నిబంధన ప్రకారం అది కుదరదు. అమ్మిన వ్యక్తి కొనుగోలు చేసిన వ్యక్తికి పట్టా చేయడు. ఇలాంటి కేసులు అధికంగా పార్ట్(బీ)లో ఉన్నాయి. చాలా వరకు సివిల్ కేసులు నమోదు చేశాం. కాగా పొజిషన్‌లో ఎవరు ఉన్నారనే విషయం పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

జిల్లాలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. యువతకు ఏ విధమైన భరోసా కల్పిస్తారు ?

కలెక్టర్: ఉద్యోగం అంటే చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగాన్నే చూస్తారు. కానీ ప్రైవేట్ సెక్టార్‌లో చేసేది కూడా ఉద్యోగమే అని గుర్తించాలి. ఆదిలాబాద్‌లో విధులు నిర్వర్తించే సమయంలో ప్రజావాణిలో చాలా మంది యువత డిగ్రీ చదివిన వారు అటెండర్, స్వీపర్ ఉద్యోగాల కోసం అడిగారు. అక్కడ పట్టణంలోని పలు షాపుల్లో 50 ఉద్యోగాలను స్వయంగా గుర్తించి వర్క్ చేసుకోవాలని సూచించాం. కేవలం ఐదుగురు మాత్రమే ఉద్యోగంలో చేరి కేవలం పది రోజులు వర్క్ చేసి మానేశారు. చదువుకున్న వారందరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే సాధ్యం కాదు. ప్రైవేట్‌లో అవకాశం వచ్చినప్పుడు పని చేయాలి. టీఎస్‌పీఎస్సీ నుంచి వెలువడే నోటిఫికేషన్లకు స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ అందిస్తాం.

ప్రభుత్వం నుంచి భూములు తీసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్: ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తా. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా నెలకొల్పేందుకు అవకాశాలు ఉన్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తాం. దీంతో ఎంప్లాయిమెంట్ పెరుగుతుంది.

జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా సాగుతోంది. ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్: సొంత పట్టా పొలంలో నుంచి మట్టి తీయాలన్నా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయి. ఎలా సక్సెస్ చేయబోతున్నారు?

కలెక్టర్: జిల్లాకు కొత్తగా వచ్చినప్పటికీ రెండు సంవత్సరాలు మంచిర్యాలలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అనంతరం ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించా. అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతా.

బాధ్యతల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: జిల్లా నూతన కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజర్షి షా అదిలాబాద్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అదిలాబాద్ నుంచి వచ్చిన రాహుల్‌రాజ్ మెదక్‌కు వచ్చారు. ఆయనకు అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్‌తో పాటు ఆర్డీఓ రమాదేవి, ఇతరశాఖల అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆయాశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడుపాయల జాతర, జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి, వైద్య ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ధరణి, తాగునీటి సమస్య, ప్రజావాణి తదితర అంశాలపై చర్చించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

మెదక్ కలెక్టరేట్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, పేదలకు సంక్షేమ పథకాలు అందాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సంక్షేమ శాఖలతో పాటు ప్రాధాన్యం ఉన్న శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణను ఈనెల 15లోగా అందజేయాలని ఆదేశించారు. సమన్వయంతో జిల్లాను అన్నిరంగాల్లో ప్రథమ స్థానంలో నిలుపుదామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ధరణి సమస్యలపై చర్చించారు.

హరీశ్‌రావు పెత్తనం ఏమిటీ?

సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



నూతన చైర్మన్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నర్సారెడ్డి

తూప్రాన్: మాజీ మంత్రి హరీశ్‌రావు గజ్వేల్ నియోజకవర్గంలో పెత్తనం చెలాయించడం ఏమిటని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ప్రశ్నించారు. బుధవారం తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గిన సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతకుముందు అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ జయచంద్రారెడ్డి ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఇప్పటివరకు నియోజకవర్గ ప్రజలను ఒక్కసారి పలకరించిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. కాని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాత్రం గజ్వేల్ నియోజకవర్గంలో పెద్దరికం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. మరో రెండు గ్యారంటీలను ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందన్నారు. నూతన పాలకవర్గం ప్రజలకు మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు. అలాగే త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాక్ పోలింగ్ తీరును పరిశీలిస్తున్న డీఈఓ తదితరులు

డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని మక్కరాజ్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించగా జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీఓ చిన్నరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యం తెలపడానికి మాక్ పోలింగ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఓటు ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమర్‌శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బండి కవిత , ఉపాధ్యాయులు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ట్రైడెంట్ చక్కెర కర్మాగారం

చెరకు రైతులకు తీపికబురు

- బకాయి సొమ్ము రూ.6.78 కోట్లు జమ
- 2024-25 సీజన్‌లో క్రషింగ్ చేపట్టేందుకు ఆసక్తి

జహీరాబాద్: గత ఏడాది కాలంగా రైతులకు చెరకు బకాయిలు చెల్లించే విషయంలో దాటవేస్తూ వచ్చిన 'ట్రైడెంట్' యాజమాన్యం ఎట్టకేలకు బాకీ తీర్చింది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని కొత్తూర్(బి)లో గల ఈ కర్మాగారం బకాయిలు చెల్లింపులో జాప్యం చేస్తుండగా రైతులు రోడ్డెక్కి ఆందోళనలను సైతం చేపట్టారు. అయినా యాజమాన్యం ఉదాసీన వైఖరిని అవలంభించింది. దీంతో రెవెన్యూ, కేన్ అధికారులు చట్ట పరంగా అడుగులు ముందుకు వేశారు. రెవెన్యూ యాక్టు అమలుకు సిద్ధపడ్డారు. ఏడు నోటీసులను జారీ చేసింది. ఫిబ్రవరి 28న ఆస్తులను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు.. కర్మాగారానికి సంబంధించిన 41.07 ఎకరాల భూమి, యంత్రాలను వేలం వేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధ పడింది. దీంతో చక్ర వ్యూహంలో చిక్కుకున్న యాజమాన్యం విధిలేని పరిస్థితుల్లో బకాయిలు చెల్లించేందుకు దిగొచ్చింది. ఆస్తుల జప్తునకు ఒక రోజు ముందు అయిన ఫిబ్రవరి 27న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రూ.5 కోట్లు బకాయిలను చెల్లించింది. మిగతా బకాయిలను వారంలోపు చెల్లింపులు జరుపుతామని హామీ ఇచ్చింది. ఈనెల 4న రూ.1.78 కోట్లు రైతుల ఖాతాల్లో వేసింది. చెరకు ట్రాన్స్‌పోర్టు బిల్లులు రూ.37.58 లక్షలు ఈనెల 7న రైతుల ఖాతాల్లో వేయనున్నట్లు ప్రకటించింది. 2022-23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రూ.7.38 కోట్లు ట్రైడెంట్ యాజమాన్యం రైతులకు చెరకు బిల్లులు బకాయి పడటం తెలిసిందే. 2024-25 క్రషింగ్ సీజన్‌కు గాను కర్మాగారాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేయనున్నట్లు వెల్లడించింది. యంత్రాల పనితీరును పరిశీలించేందుకు నిపుణులను రప్పించనున్నట్లు పేర్కొంది. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా కర్మాగారాన్ని క్రషింగ్‌ను అన్ని విధాలుగా సిద్ధం చేస్తామని యాజమాన్యం ప్రకటించింది.

బిల్లులు రాని వారు సంప్రదించాలి

యాజమాన్యం ఇప్పటికే రైతుల ఖాతాల్లో చెరకు బకాయిలను జమ చేసింది. ఇంకా రూ.37 లక్షలు ట్రాన్స్‌పోర్టు బిల్లులను గురువారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇంకా ఎవరికైనా బిల్లులు అందని పక్షంలో జహీరాబాద్‌లోని సీడీసీ కార్యాలయాన్ని, కర్మాగారం యాజమాన్యాన్ని సంప్రదించాలి. ఖాతాలు పనిచేయని వారు ఉంటే సంప్రదిస్తే కొత్త ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తాం. వచ్చే సీజన్‌లో క్రషింగ్ చేపట్టనున్నట్లు యాజమాన్యం ముందుకు వస్తే సంతోషించదగిన విషయం.

–రాజశేఖర్,
కేన్ అసిస్టెంట్ కమిషనర్, సంగారెడ్డి

పెద్దపట్నానికి వేళాయె..

మల్లన్న సన్నిధిలో రేపే

- కొమురవెల్లిలో సర్వం సిద్ధం
- తరలిరానున్న భక్తజనం
- తోటబావి ప్రాంగణంలో స్వామివారి కల్యాణం



విద్యుత్ కాంతుల్లో మల్లన్న ఆలయం

కొమురవెల్లి (సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో పెద్దపట్నం నిర్వహిస్తారు. ఈసందర్భంగా మల్లన్నను దర్శించుకోవడానికి భారీగా భక్తులు తరలి రానున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ప్రతేక పూజలు నిర్వహించనున్నారు. ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నంవేసి స్వామి వారికి కల్యాణం కనుల పండువగా సాగనుంది.

వైవిధ్య భరితం..

ఆలయ తోట బావి ప్రాంగణంలో వేసే పెద్ద పటానికి వైవిధ్యం, విశిష్టత ఉంది. మల్లికార్జునస్వామి వీరశైవుల ఆడబిడ్డ మేడలాదేవితో పాటు యాదవుల ఆడ పడుచు గొల్లకేతమ్మను పరిణయం మాడిన తరుణంలో స్వామి వారికి రెండు రకాలుగా పూజలు చేస్తారు. మొదటగా వీరశైవులు బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారికి కల్యాణం జరిపిస్తారు. యాదవ పూజారులు తమ ఆచారం ప్రకారం శివరాత్రిరోజు పంచవర్ణాలతో పట్నం వేసి కల్యాణం నిర్వహిస్తారు. పసుపు, కుంకుమ, తెల్ల పిండి, సునేరు, పచ్చలను సమ్మేళనంచేసి నిమ్మకాయలతో చిత్రకన్ను నెలకొల్పి 41 వరుసల్లో పటాన్ని వేస్తారు. పట్నం వేయడానికి ముందు ఒగ్గుపూజారులు స్వామి వారిని పల్లకీలో ఊరేంపుగా తీసుకొస్తారు. మల్లన్న, కేతమ్మ, మేడలాదేవికి నూతన వస్త్రాలను సమర్పిస్తారు. స్వామివారికి త్రిశూళం, ఢమరుకాలను నెలకొల్పిన అనంతరం పెద్దపట్నంపైకి ఆవాహనం చేస్తారు. నలువైపుల గుమ్మడికాయలతో బలిహరణ చేస్తారు. తెల్లవారుజామున ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పెద్ద పట్నం చుట్టూ ప్రదక్షణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభిస్తారు.

ఏర్పాట్లు పూర్తి

మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే పెద్ద పట్నం కోసం సర్వం సిద్ధం చేశారు. పెద్దపట్నం నిర్వహించే తోట బావి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాల్లో, విద్యుత్ స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. భక్తుకు ఇబ్బదులు కలగకుండా ఏర్పాట్లను ఆలయ ఈఓ బాలాజీ, చైర్మన్ లక్ష్మారెడ్డి సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ

కొమురవెల్లి (సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో చేపట్టే పెద్దపట్నం ఏర్పాట్లను హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఆలయ తోట బావి ప్రాంగణాన్ని, గ్యాలరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పెద్దపట్నం తిలకించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తోట బావి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీశ్ తదితరులు

క్లుప్తంగా

నాలుగు విభాగాల్లో ఈవెంట్లు



వాహనాన్ని ప్రదర్శిస్తున్న అతిథులు, కాలేజీ విద్యార్థులు

నర్సాపూర్‌ : బాజా సై ఇండియా పోటీల్లో భాగంగా నాలుగు విభాగాల్లో ఈవెంట్లు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ బాజా సై ఇండియా ఆర్గనైజింగ్‌ చైర్మన్‌ సంజయ్‌ నిబంధే తెలిపారు. బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో నేటి నుంచి ఈనెల 11 వరకు జరుగనున్న ఈబాజా సై ఇండియా పోటీల సందర్భంగా బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మెకానికల్‌ ఇంజనీరింగు ఈవెంట్‌లలో ఎంబాజా ఒకటని తెలిపారు. సై ఇండియా 2024 పోటీల్లో 70 ఎలక్ట్రిక్‌ బగ్గీలను ప్రదర్శిస్తుందన్నారు. ఒక్కో వాహనం తయారీకి సుమారు రూ.4 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకు విద్యార్థులు ఖర్చు చేసి వాహనాలను సిద్ధం చేశారని తెలిపారు.పోటీల్లో నెగ్గిన వారికి రూ.8 లక్షల నగదు బహుమతి అందచేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో భారత్‌ పెట్రోలియం కార్పొరేషన్‌ లిమిటెడ్‌ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హెడ్‌ ఆచమ్‌ టిప్రాన్‌, ఈబాజా సై ఇండియా 2024 కన్వీనర్‌ యోగేశ్‌ నాగేందిరన్‌, బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ ప్రిన్సిపాల్‌ సంజయ్‌ దూబె, డైరెక్టర్‌ లక్ష్మీప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్‌రూరల్‌: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌ మార్గంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగాపూర్‌ మార్గంలోని ఓ ఇంట్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, గజ్వేల్‌ పోలీసులు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేయగా ఆరుగురు వ్యక్తులతో పాటు వారి వద్దనుంచి రూ. 49,616 నగదు, 6 మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడైనా పేకాట, జూదంతో పాటు చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే తమకు (87126 67447, 87126 67446) సమాచారం అందించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆత్మహత్య



నివాళులర్పిస్తున్న రసమయి బాలకిషన్‌

బెజ్జంకి(సిద్దిపేట) : పురుగుల మందు తాగి బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బేగంపేట గ్రామానికి చెందిన సీనియర్‌ బీఆర్‌ఎస్‌ నాయకుడు, రైతు బంధు జిల్లా కమిటీ మాజీ సభ్యుడు అయిల పాపయ్య బోదెకాలుతో ఇబ్బంది పడుతున్నాడు. ఆర్యోగం బాగా లేక పోవడంతో మంగళవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. మానకొండూర్‌ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ పాపయ్య మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిదులు, కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.



ముస్తాబైన ఏడుపాయల ఆలయం

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే మెదక్‌ జిల్లాలోని ఏడుపాయల జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఏడుపాయల వనదుర్గామాతకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడురోజులపాటు జాతర నిర్వహిస్తారు. మహా జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతాల నుంచి సుమారు 10 లక్షల భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఉత్సవంగా గుర్తింపు పొందిన జనజాతరకు జిల్లా అధికార యంత్రాంగం..ఆలయ పాలకవర్గం విస్తృత ఏర్పాట్లు చేస్తుంది.

– పాపన్నపేట (మెదక్‌)

ఏడుపాయలకు రారండి

రేపటి నుంచి జాతర ప్రారంభం

- మూడు రోజులపాటు ఘనంగా నిర్వహణ
- మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు
- సుమారు 10 లక్షల మంది భక్తులు రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ సిబ్బంది



ఆలయానికి వెళ్లే దారిలో తోరణం

లక్షలాది భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఏడుపాయల వన దుర్గామాత ఆలయానికి రెండు వేల ఏళ్ల చరిత్ర ఉంది. సర్ప జాతిపై ప్రతీకారం తీర్చుకునేందుకు జనమే జయుడు ఈ ప్రాంతంలోనే సర్పయాగం చేశాడని ప్రతీతి. ఇందుకనుగుణంగా ఏడుపాయల శివారులో మంజీరా నది ఒడ్డున ఇసుక తిన్నెల్లో, ఇప్పటికీ విభూతి లభిస్తుందని స్థానికులు చెబుతుంటారు. క్రీ.శ 1870 కాలమున కాశీనాథ యోగింద్రుడు వనదుర్గా ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు తెలుస్తుంది. ఘళిని యప్పచాకి అనే శిల్పి తయారు చేసిన దుర్గమ్మ నల్లరాతి విగ్రహాన్ని పుష్పగిరి పీఠాధిపతి జగత్‌గురు ఆదిశంకరాచారి 2 ఫిబ్రవరి 1980 నాడు పునఃప్రతిష్ఠించారు.



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

మూడు రోజుల జాతర..

మహా జాతర మూడు రోజులపాటు కొనసాగుతుంది. మొదటి రోజు శుక్రవారం ఏడుపాయలకు చేరుకునే భక్తులు మంజీరా నదిలో స్నానాలు చేసి, దుర్గమ్మను దర్శించుకొని శివరాత్రి దీక్షలు చేపడుతారు. సాయంత్రం స్థానిక శివాలయంలో పూజలు చేసి పండ్లతో దీక్షలు విరమిస్తారు. రాత్రంతా భజనలు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తూ రాత్రంతా జాగరణ చేస్తారు. రెండో రోజు శనివారం బండ్లు తిరిగే కార్యక్రమం కొనసాగుతుంది. ఇది జాతరలో అత్యంత ప్రధానమైన ఘట్టం. పాపన్నపేట మండల పరిధిలోని గ్రామస్తులు ఎడ్ల బండ్లను రంగులతో అలంకరించి, మెరుపు కాగితాలతో తీర్చిదిద్దుతారు. వాటిపై దేవతా మూర్తుల చిత్రపటాలను ఉంచుతారు. డప్పుచప్పుళ్ల కనుగుణంగా పోతరాజుల గావుకేకలు, యువకుల నృత్యాల మధ్య బండ్ల ఊరేగింపు కొనసాగుతుంది. సాయంత్రం జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించడానికి లక్షలాది భక్తులు తరలి వస్తారు. చివరి రోజైన ఆదివారం రథోత్సవం జరుగుతుంది. రాత్రి 8 గంటలకు రథాన్ని విద్యుత్‌ దీపాలతో అలంకరిస్తారు. 18 మంది పని బాటల వారు రథం ముందు ముగ్గులు వేసి, పట్టుపరిచి పూజలు చేస్తారు. అనంతరం వేలాది భక్తులు రథాన్ని లాగుతూ ఆలయం ముందు వరకు తీసుకొస్తారు.

దారులన్నీ ఏడుపాయలకే..

ఏడుపాయల జాతరకు ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌ నుంచి వచ్చే భక్తులు నర్సాపూర్‌, తూప్రాన్‌ మీదుగా ఏడుపాయలకు రావచ్చు. కొల్చారం మండలం పోతంషెట్పల్లి దాటగానే 500 మీటర్ల దూరంలో ఎడమ వైపు ఏడుపాయల దారి వస్తుంది. ఆలయానికి కిలోమీటర్‌ దూరంలోనే పార్కింగ్‌ ఉంటుంది. అక్కడే వాహనాలు పార్కింగ్‌ చేయాలి. సిద్దిపేట, కామారెడ్డి, ఎల్లారెడ్డి నుంచి వచ్చే భక్తులు మెదక్‌ నుంచి పోతంషెట్పల్లికి ఇవతల గల ఏడుపాయల దారి గుండా వెళ్లాలి. కర్ణాటక, నారాయణఖేడ్‌, శంకరంపేట నుంచి వచ్చే భక్తులు బొడ్మట్‌పల్లి, పాపన్నపేట మీదుగా నాగ్సాన్‌పల్లి కమాన్‌ నుంచి ఏడుపాయలకు వెళ్లవచ్చు. చెలిమల కుంట వద్ద పార్కింగ్‌ ఉంటుంది.

• ఫ్లాగ్‌ మార్చ్‌



ఫ్లాగ్‌ మార్చ్‌లో కేంద్ర బలగాలు, పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్‌: శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట వన్‌ టౌన్‌ సీఐ లక్ష్మీబాబు అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని ఇక్బాల్‌ మినార్‌, ముస్తాబాద్‌ చౌరస్తా, నాసర్‌పూర, బారాయిమామ్‌, సుభాష్‌ రోడ్డు, బస్టాండ్‌ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాల్లో సీఐఎస్‌ఎఫ్‌ కేంద్ర బలగాలతో కలిసి పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇన్సిడెంట్‌ ఫ్రీ ఎన్నికల నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

• లక్ష్మీ సందడి..



మున్సిపల్‌ కార్యాలయం వద్ద దరఖాస్తుదారుల సందడి

సిద్దిపేటజోన్‌ : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాల కోసం దరఖాస్తుల ఆన్‌లైన్‌ ప్రక్రియతో మున్సిపల్‌ కార్యాలయం కిక్కిరిసిపోయింది. మున్సిపల్‌ అధికారులు ఏర్పాటు చేసిన సేవా కేంద్రానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

• పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్‌)లో గురువారం "సావిత్రిబాయి పూలే సామాజిక అవగాహన" అనే అంశంపై నిర్వహించనున్న సింపోజియా కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వాసం శ్రీనివాస్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య వ్యక్తగా ప్రముఖ రచయిత్రి సజయ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్‌ శ్రీనివాస్‌, డాక్టర్‌ సుజాత, డాక్టర్‌ మల్లేశం, డాక్టర్‌ శ్రద్ధానందం, డాక్టర్‌ హరిబాబు, డాక్టర్‌ గోపా సుదర్శనం, డాక్టర్‌ మధుసూదన్‌, భిక్షపతి, కొండల్‌రెడ్డి, గణేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

రియాక్టర్‌ పేలిన ప్రమాదంలో..

- చికిత్స పొందుతూ కెమిస్ట్రీ వినోద్‌ కుమార్‌ మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- పరిశ్రమ ఎదుట మృతుడి కుటుంబీకులు ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు



వినోద్‌ కుమార్‌ (ఫైల్‌)

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం గుండ్ల మాచునూర్‌ గ్రామ శివారులో గల కోవలంట్‌ ల్యాబొరేటరీస్‌ పరిశ్రమలో రియాక్టర్‌ పేలి నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బుధవారం పరిశ్రమలో కెమిస్ట్రీగా పని చేస్తున్న హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌ కుమార్‌ (26) మృతి చెందాడు. పరిశ్రమం నిర్లక్ష్యంతోనే వినోద్‌ కుమార్‌ మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు చెప్పినా వినకపోవడంతో పరిస్థితి చేజారుతుందని గమనించిన పరిశ్రమ యాజమాన్యం మృతుడి బంధువులతో చర్చలు జరిపి మృతుడి కుటుంబానికి రూ.45 లక్షల నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ ఫ్యాక్టరీస్‌ ప్రవీణ్‌ కుమార్‌, హత్నూర తహసీల్దార్‌ పర్విన్‌ షేక్‌లు పరిశ్రమను సందర్శించి విచారణ చేశారు. పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌ తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో ముగ్గురు కార్మికులు స్వాదీన్‌ రాజమల్‌, లై బాబు తుర్రై, ఫాదర్‌ మరండిలు ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆ ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎప్పుడూ ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని తోటి కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, మృతుడు వినోద్‌ కుమార్‌కు భార్య వీరమని, ఆరు నెలల బాలుడు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వర్గల్‌(గజ్వేల్‌): చేపల వేటకు వెళ్లిన చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన వర్గల్‌ మండలం మీనాజీపేటలో వెలుగు చూసింది. గౌరారం ఎస్సై శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మీనాజీపేటకు చెందిన బత్రల కృష్ణయ్య(53) కూలీ పని చేస్తుంటాడు. భార్య మణెమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మంగళవారం కూలీ పనులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. కానీ పనికి వెళ్లకుండా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో చేపలు పట్టేందుకు గ్రామ సమీప హంసోనికుంట వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చేపలు పడుతుండగా అప్పటికే వేరేవాళ్లు చేపల కోసం వేసిన వలలు కాళ్లకు చుట్టుకోవడంతో చెరువులో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఇంటినుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిట్టీల పేరిట చుట్టేశారు!

సుమారు రూ.30 కోట్లతో దంపతుల ఉడాయింపు

తూప్రాన్‌: చిట్టీలు, అధిక వడ్డీలతో సుమారు రూ. 30 కోట్ల వరకు ప్రజలను మోసం చేసిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా తూప్రాన్‌ పట్టణానికి చెందిన బిజిలీపురం యాదగిరి, భార్య జ్యోతి దంపతులు ఇద్దరు పిల్లలతో మంగళవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా యాదగిరి అదృశ్యం అయిన సంఘటన పత్రికల్లో ప్రచురితం కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 మంది వరకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. యాదగిరి అధిక వడ్డీ చెల్లిస్తానని ప్రజల నుంచి రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని మొదట్లో నమ్మించాడు. ఇది నమ్మిన ప్రజలు అధిక మొత్తంలో అప్పగించారు. అలాగే చిట్టీలు సైతం నిర్వహిస్తూ ఆ డబ్బులను తన అవసరాలకు వాడుకున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. మోసపోయిన వారు సుమారు 70 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. ఇంటిపై రుణాలు, క్రెడిట్‌ కార్డులపై డబ్బులు ఇలా అందినకాడికి ప్రజల నుంచి డబ్బులు తీసుకున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. పరారీలో ఉన్న యాదగిరిని పోలీసులు అదుపులోకి తీసుకుంటే మరికొన్ని నిజాలు బయట పడనున్నాయి. అయితే డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు లబోదిబోమంటున్నారు.

అంచనా ఆదాయం రూ.51.07 కోట్లు

జోగిపేట మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌

జోగిపేట(అందోల్‌): 2024–25 సంవత్సరానికిగాను అందోల్‌ జోగిపేట మున్సిపల్‌ అంచనా ఆదాయం రూ.51.07 కోట్లు, అంచనా వ్యయం రూ.50.88 కోట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బుధవారం మున్సిపల్‌ చైర్మన్‌ మల్లయ్య అధ్యక్షతన బడ్జెట్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌ హాజరయ్యారు. మిగులు బడ్జెట్‌ రూ.6.66 లక్షలుగా నిర్ణయించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు ఆర్‌.భవానీ, నాగరాజులు కోరగా దానికి సంబంధించి తీర్మాణం చేసి పంపాలని, సీసీ కెమెరాలకు సంబంధించి ప్రత్యేకంగా నిధులను కేటాయించుకోవాల్సి వస్తుందని అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌ సూచించారు. కార్యక్రమంలో కమిషనర్‌ తిరుపతి, వైస్‌ చైర్మన్‌ ప్రవీణ్‌, కౌన్సిలర్లు సురేందర్‌ గౌడ్‌, శంకర్‌, రంగ సురేష్‌, హరికృష్ణగౌడ్‌, కే.నాగరాజు,చందర్‌, మాధవి, రేఖా ప్రవీణ్‌, సుమిత్ర, భవానీ, భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచ్‌ పడితే పతకమే..



అంతర్జాతీయ స్థాయిలో బహుమతి పొందుతున్న మహేశ్‌ గౌడ్‌ (ఫైల్‌)

- మార్షల్‌ ఆర్ట్స్‌లో రాణిస్తున్న పేదింటి బిడ్డ
- అంతర్జాతీయ కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో బంగారు పతకాలు
- జమ్మూలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

హత్నూర(సంగారెడ్డి): మెరుపు వేగం ఆ బాలుడి సొంతం.. పంచ్‌ పడిందా పతకం ఖాయం.. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ బంగారు వెండి కాంస్య పతకాలు సాధిస్తున్నాడు హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన మహేశ్‌ గౌడ్‌. నాలుగేళ్లగా మార్షల్‌ ఆర్ట్స్‌ కుంగ్‌ ఫూ, కరాటే, కిక్‌ బాక్సింగ్‌, ఉషు క్రీడల్లో పలు పతకాలను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో సాధించి అందరి చేత శభాష్‌ అనిపించుకున్నాడు. 12 ఏళ్ల ఉన్న మహేశ్‌ గౌడ్‌ని చూస్తే పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పలుమార్లు విజయాలు సాధించి బంగారు పతకాలను సొంతం చేసుకున్నాడు. మరోసారి ఈనెల 26 జమ్మూ కాశ్మీర్‌ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఉషు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు.

సిరిపుర గ్రామానికి చెందిన కిషన్‌ గౌడ్‌, లక్ష్మి దంపతుల కుమారుడు మహేశ్‌ గౌడ్‌ గ్రామంలోనే జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కిక్‌ బాక్సింగ్‌లో రంగారెడ్డి, హైదరాబాద్‌, కరీంనగర్‌, వరంగల్‌, హన్మకొండ, నిర్మల్‌ జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. ఇప్పటివరకు 12 బంగారు, 8 వెండి, 14 కాంస్య పతకాలు సాధించాడు. ఇటీవలె హిమాచల్‌ ప్రదేశ్‌ మండిలో నిర్వహించిన జాతీయ స్థాయి ఉషు పోటీల్లో పాల్గొన్నాడు.



సాధన చేస్తున్న మహేశ్‌ గౌడ్‌

క్రీడాకారులను ప్రోత్సహించాలి



తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్‌ పరంగా చాలా మంది క్రీడాకారులు ఎంతో నైపుణ్యం సాధించిన వాళ్లు ఉన్నారు. కానీ ఆర్థిక పరిస్థితుల కారణంగా రాణించలేకపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజా పాలకులు గాని క్రీడాకారులకు ప్రోత్సహిస్తే దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు, గుర్తింపు లభిస్తాయి. చదువుకున్న యువకులకు ఉద్యో గ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

–మాస్టర్‌ పోచయ్య

రాష్ట్రానికి గుర్తింపు తెస్తా



ఇప్పటి వరకు పలుమార్లు రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో బంగారు పతకాలు సాధించాను. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నప్పటికీ మా అమ్మానాన్న పంపించారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేలా చేశారు. ఒలింపిక్‌లో పతకమే లక్ష్యంగా కఠోర శ్రమ చేస్తున్నాను.మాస్టర్‌ కూడా నన్ను ప్రోత్సహిస్తున్నారు.

– మహేశ్‌ గౌడ్‌, 9వ తరగతి

డబ్బుల విషయంలో గొడవ

తాగిన మైకంలో వ్యక్తి హత్య



యాదయ్య (ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): తాగిన మైకంలో డబ్బుల కోసం గొడవై విచక్షణారహితంగా ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్‌, స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని ఖాజీగూడ గ్రామానికి చెందిన సంపంగి యాదయ్య (38) కుటుంబ సభ్యులతో కలిసి బొల్లారంలోని బీరప్పబస్తీలో నివాసం ఉంటున్నాడు. రాళ్లు కొట్టుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కంది మండలం చేర్యాల గ్రామానికి చెందిన రాజు రాళ్లు కొట్టుకుంటుండటంతో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. రాళ్లు విక్రయించే క్రమంలో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో మూడు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి యాదయ్య, రాజు బొల్లారంలోని గండిగూడెంకు వెళ్లే రహదారి పక్కన మద్యం సేవిస్తున్నారు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ మొదలై రాజు ఆగ్రహంతో బండరాయితో యాదయ్య తలపై మోదాడు. యాదయ్య అక్కడికక్కడే మృతి చెందగా రాజు మద్యం సేవించి ఉండటంతో అక్కడే పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న జిన్నారం సీఐ సుధీర్‌కుమార్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సైకిల్‌ పైనుంచి జారిపడి..

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



రోడ్డు పక్కన హుస్సేన్‌ మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్‌) : ప్రమాదవశాత్తు సైకిల్‌ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన విషాదకర ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్‌ హుస్సేన్‌(67) పొలం వద్దకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం వెల్దుర్తి గ్రామ శివారులో రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని వాహనదారులు గమనించారు. వారి సమాచారంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పరిశీలించి మృతుడు మహ్మద్‌ హుస్సేన్‌గా గుర్తించారు. ప్రమాదవశాత్తు మెల్లూర్‌ నుంచి వెల్దుర్తి వైపు సైకిల్‌పై వస్తుండగా రోడ్డుపక్కన జారిపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ నవతగౌడ్‌ తెలిపారు.